ఆధ్యాత్మిక వేసవి శిబిరం ప్రారంభం

బాలనందం ఆధ్యాత్మిక శిబిరాన్ని ప్రారంభిస్తున్న మృత్యుంజయ శర్మ

సిద్దిపేట టౌన్, మే 28: సిద్దిపేట బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మూడు రోజులు కొనసాగే బాలానందం ఆధ్యాత్మిక వేసవి శిబిరాన్ని మంగళవారం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గురువు వేలేటి మృత్యుంజయశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఎన్నో విషయాలు తెలుసుకోవాలనే ఆత్రుత ఉంటుందన్నారు. ఈశ్వరీయ జ్ఞానం ద్వారా సంపూర్ణంగా తెలుసుకోవచ్చన్నారు. శిబిరంలో చిన్నారులకు డ్రాయింగ్ స్పీచ్, తదితర పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకురాలు భవాని తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, బిందు, ఓంకార్, ఉదయ్ పాల్గొన్నారు.

సైనికుల వలే పనిచేసిన బీఆర్ఎస్ శ్రేణులు

ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 28: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సైనికుల వలే పని చేశారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా పార్టీ గెలుపు కోసం శ్రమించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎన్నిక ఏదైనా బీఆర్ఎస్ శ్రేణులు క్రమశిక్షణ గల సైనికుల వలే మోహరించి పనులు చేయడం సంతోషంగా ఉందని, అధికారం అనేది ముఖ్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం, వారి సంక్షేమమే తమ పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

శంకరాచారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డు

విశ్వకర్మలెజెండరీ అవార్డు అందుకుంటున్న శంకరాచారి

బెజ్జంకి, మే 28: మండలంలోని బెజ్జంకి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ,మండల కేంద్రంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన నారోజు శంకరాచారి వివిధ రంగల్లో చేసిన సేవలకు హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో విశ్వకర్మ లెజెండరీ అవార్డు అందుకున్నారు. శంకరాచారి గ్రామీణ ప్రాంతంలోని చాలామంది యువతీ యువకులకు సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఎంతో మంది సివిల్స్ వైపు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. గ్రామంలో ఎస్‌జీవో ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, లైబ్రరీ ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన శంకరాచారి అవార్డు అందుకోవడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం శంకరాచారిని గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

అహ్మదీపూర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 28: మండలంలోని అహ్మదీపూర్‌లో మంగళవారం వైభవంగా శ్రీరేణుకాఎల్లమ్మ కల్యాణం నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో సంప్రదాయ పద్ధతిలో బోనాలు తీశారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌ను శాలువాలతో నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజాం, బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, అశోక్, స్వామి, రాములుగౌడ్, నరేశ్‌గౌడ్, రామాగౌడ్, ముత్యంగౌడ్, జగన్‌గౌడ్, యాదగిరిగౌడ్, అంజగౌడ్, కిష్టాగౌడ్, సత్యం గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్.. సద్వినియోగం

ఓపెన్ జిమ్‌లో జిమ్ చేస్తున్న రైతు

చేర్యాల, మే 28: బీఆర్ఎస్ హయాంలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు అన్ని వర్గాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని పెద్ద చెరువు కట్ట పై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు రోజూ అన్ని వయస్సులకు చెందిన వ్యక్తులు వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం 65 ఏండ్లు కలిగిన ఓ రైతు ఓపెన్ జిమ్‌కు వచ్చి ఇలా జిమ్ చేస్తున్నప్పుడు 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

గజ్వేల్, మే 28: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. మంగళవారం గజ్వేల్ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై, మైనర్, త్రిబుల్ రైడింగ్‌పై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేస్తున్న మైనర్ పిల్లలను పట్టుకొని కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

నేరాలపై పోలీసుల 'కనువిప్పు'

సిద్దిపేటరూరల్, మే 28: నేరాలు, సైబర్ మోసాలు, మూఢ నమ్మకాలపై సిద్దిపేట రూరల్ ఏఎస్సై పోచాగౌడ్ పర్యవేక్షణలో మాచాపూర్‌లో ఆదివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచాగౌడ్ మాట్లాడుతూ యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవడాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం సెల్: 87126 67100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సిద్దిపేట రూరల్ పీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

దౌల్తాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న దుబ్బాక ఏడీఏ శ్యామ్‌సుందర్

అక్కన్నపేట: గుబ్బడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రీలత

రాయపోల్, మే 28: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఏడీఏ శ్యామ్‌సుందర్ హెచ్చరించారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట దౌల్తాబాద్ ఏవో గోవిందరాజులు, ఏఈవో ప్రశాంత్ ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

అక్కన్నపేట, మే 28: విత్తనాలు కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవోలు శ్రీలత, సబిహా సూచించారు. మండల కేంద్రంతో పాటు జనగామ, గుబ్బడిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 28: వానకాలంలో పంటల సాగుకు ముందు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏఈవో రాకేశ్ అన్నారు. మద్దూరు మండలంలోని ధర్మారంలో విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

దుబ్బాక ఏడీఏ శ్యామ్‌సుందర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మిరుదొడ్డి, మే 28 : ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మిరుదొడ్డి ఏవో బోనాల మల్లేశం అన్నారు. మిరుదొడ్డి టౌన్‌లోని ఆయా ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మికంగా ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఏఎస్సై బిక్యానాయక్, ఏసీవోలు లోహిత్, సాయికుమార్, పోలీసు సిబ్బంది రవి పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి

వర్గల్, మే 28: విత్తన ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వర్గల్ వ్యవసాయాధికారి శేషశయన తెలిపారు. మండలకేంద్రంతో పాటు సింగాయిపల్లి, గౌరారం, నెంటూర్, గిర్మాపూర్, గోవిందాపూర్, శాకారంలో ఏఈవోలు సంతోష్, సుప్రజాతేజస్వితో కలిసి ఆమె రైతులకు కల్తీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు తప్పకుండా నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వానకాలం సాగుపై రైతులకు అవగాహన

బెజ్జంకి, మే 28: మండలంలోని దేవక్కపల్లి, వీరాపూర్, తోటపల్లి, గూడెం, వడ్లూర్, చీలాపూర్‌పల్లి, తిమ్మాయ్యపల్లిలో వానకాలం పంటల సాగుపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం గుర్తించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రేణుకశ్రీ, భరత్, మౌనిక, మానస, రచన, సాయిశంకర్, రైతులు పాల్గొన్నారు.

కొండపాక మండలంలో...

కొండపాక(కుకునూరుపల్లి), మే 28: కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను విజిలెన్స్ ఎస్సై సాయిమ్ ప్రేమ్‌దీప్, గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి తనిఖీ చేశారు. సందర్భంగా స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్ బిల్ బుక్‌లతో పాటు దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రియదర్శిని, ఏఈవో రమ్యశ్రీ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

అక్కన్నపేట, మే 28: మండలంలోని గౌరవెల్లి, గుబ్బడి, అక్కన్నపేటలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు, స్థానిక పోలీసులు కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో విత్తన సంచులను పరిశీలించారు. ఎస్సై వివేక్, ఏఈవో శ్రీలత, సబిహా పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచాలి

కొమురవెల్లి, మే 28: మండలంలో రైతులకు సరిపడ జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి విమర్శించారు. మంగళవారం కొమురవెల్లిలో సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే జీలుగ విత్తనాలు మండలంలో కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, అత్తిని శారద, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, ఉల్లంపల్లి సాయిలు, ఆరుట్ల రవీందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో మల్లేశం

కొండపాక: వెలికట్ట చౌరస్తా వద్ద ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కేంద్రియ విద్యాలయ పనుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

శరవేగంగా పనులు పూర్తి చేయాలి

సిద్దిపేటరూరల్, మే 28: మండలంలోని ఎన్సాన్‌పల్లిలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. విద్యాసంవత్సరం ప్రారంభంకావడానికి తక్కువ సమయం ఉన్నందున విద్యుత్, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు వేగంగా చేయాలని సూచించారు. ఆటస్థలాన్ని త్వరగా చదును చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. పాఠశాలలోని బావిని పూడ్చివేయడానికి, మెయిన్ గేట్ వద్ద విద్యుత్ వైర్లు తగలకుండా ఎత్తైన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాలయం, విద్యాలయ క్వార్టర్ మధ్యలో 250 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి త్వరగా ప్రతిపాదన తయారు చేసి కేంద్రానికి పంపించాలని విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేశ్వరిని ఆదేశించారు. కలెక్టర్ వెంట విద్యుత్‌శాఖ డీఈ మహేశ్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్, విద్యాలయ నిర్మాణ ఎగ్జిక్యూటివ్ నేషనల్ ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ ఏఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఏఈ తదితరులు ఉన్నారు.

చెత్తను వేరుచేసే బాధ్యత యజమానులదే

మాట్లాడుతున్న ఉదయ్‌చందర్

హుస్నాబాద్‌టౌన్, మే 28: ఇంటి నుంచి తడి,పొడి, హానికరమైన చెత్తను వేరుచేసే బాధ్యత ఇంటి యజమానులలేదని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బేసిల్ పౌండేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడిచెత్తకు సంబంధించిన బుట్టలను ప్రతి ఇంటికీ ఇవ్వడం జరిగిందన్నారు. వార్డు అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడిచెత్తను వేరుచేసి ఇచ్చేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బేసిల్‌పౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్‌చందర్, సభ్యులు నవీన్, సుమన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవి కుమార్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మిరుదొడ్డి క్రీడాకారులు

పరశురాములు

పవన్ గౌడ్

మిరుదొడ్డి, మే 28: జాతీయ స్థాయి యూనివర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మిరుదొడ్డి టౌన్‌కు చెందిన మద్దెల పరశురాములు (మహాత్మా లా కాలేజీ), అందె పవన్ గౌడ్ (బవన్స్ న్యూ సైన్స్ కాలేజీ) ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మిరుదొడ్డి మాజీ ఎంపీటీసీ-1 గొట్టం బైరయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 నుంచి జూన్ 3 వరకు తమిళనాడులోని జెప్పియర్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు ఉస్మానియా యూనివర్సిటీ తరపున పాల్గొంటారన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్ష

సిద్దిపేటరూరల్,మే 28: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 21 కేంద్రాల్లో 8239 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని, జూన్9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులను 9 గంటల నుంచి 10 గంటల్లోపు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించాలని, అనంతరం ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదన్నారు. అదనపు కలెక్టర్ గరిమాఅగ్రావాల్, అడిషనల్ డీసీపీ(ఏఆర్) సుభాష్‌చంద్రబోస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాభిశిల వార్షిక మహోత్సవం

పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొండపాక(కుకునూరుపల్లి), మే 28 : కొండపాక మండలంలోని బందారంలో మంగళవారం అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో భవానంద శర్మ వైదిక నిర్వహణలో నాభిశిల వార్షిక మహోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి నాభిశిలకు జలాభిషేకం నిర్వహించారు. దుర్గమ్మకు మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఎంపీటీసీ ర్యాగల్ల సుగుణాదుర్గయ్య, మాజీ సర్పంచ్ గజ్వేల్ రజితాకరుణాకర్‌రెడ్డి, నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హన్‌మాన్ హోమం

హన్‌మాన్ హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), మే28: మద్దూరు మండలంలోని నర్సాయపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామిడి రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు మల్లావజ్జుల చంద్రశేఖర్‌శర్మ, దూసకంటి ప్రశాంత్‌శర్మ వైదిక నిర్వహణలో 41 రోజుల పాటు హన్‌మాన్ మాలధారులు హన్‌మాన్ హోమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం కొమ్మూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు. జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి లు, బెక్కల్ ఆలయ చైర్మన్ మల్లేశం, నాయకులు ఆగంరెడ్డి,శ్రీనివాస్, శివయ్యగౌడ్, బాలయ్య, రాజు పాల్గొన్నారు.

బెజ్జంకిలో హనుమాన్ శోభాయాత్ర

బెజ్జంకి, మే 28: మండల కేంద్రంలో హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ భారీ విగ్రహ ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. తోటపల్లి మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు రామాలయంలో భిక్షఏర్పాటు చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం

మిరుదొడ్డి, మే 28: మండల కేంద్రమైన మిరుదొడ్డి పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో ఆంజనేయస్వామికి హనుమాన్ మాలధారులు ప్రత్యేక పూజలు, 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట కమాన్, మే 28 : సిద్దిపేటలోని గణేశ్‌నగర్‌లోప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు చిలక మర్రి వెంకట రమణచార్యులు ఆధ్వర్యంలో హనుమాత్ వ్రతం నిర్వహించారు.హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

అంతర్ రాష్ట్ర డీజిల్ దొంగల వివరాలను వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మే 28 : అంతర్ రాష్ట్ర డీజిల్ దొంగల ముఠాను మంగళవారం కుకునూరుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరాస్తుల వివరాలను ఏసీపీ పురుషోత్తంరెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, సిబ్బందితో కలిసి ప్రత్యేక టీం ఏర్పాటు చేసి రోజూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వేకువజామున రాజీవ్ రహదారిపై చేర్యాల క్రాస్ రోడ్డు వద్ద తనిఖీ చేస్తుండగా వాహనాల్లో డీజిల్ క్యాన్లపై నల్లటికవరు కప్పి అనుమానాస్పదంగా కనపడటంతో వారిని పోలీసులు పట్టుకొని విచారించారు. డీజిల్ దొంగతనాలకు పాల్పడినట్లు రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మొయిన్ మోహ ల్ల, మధ్యప్రదేశ్‌కు చెందిన హనీఫ్‌ఖాన్, రోషన్‌జాతవ్, ముఖేశ్‌వర్మ, బీరంసింఘ్‌వర్మ ఒప్పుకున్నారు. నిందితులను పట్టుకున్న తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది ఎస్.రమేశ్, బి.రాజును ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించడంతో పాటు త్వరలో రివార్డు అందజేస్తామని తెలిపారు.

వాసవి మాత పారాయణం

వాసవి మాత పారాయణంలో భక్తులు

సిద్దిపేట టౌన్, మే 28: సిద్దిపేట ఇందిరమ్మ కాలనీ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య భవన్‌లో మంగళవారం వాసవి మాత జీవిత చరిత్ర పారాయణాన్ని పఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు, క్లబ్ అధ్యక్షుడు బెజుగం కృష్ణమూర్తి, కొత్తరి బాలరాజు, కూర శివకుమార్, కాపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొండపాక(కుకునూరుపల్లి), మే 28 : కొండపాక మండల కేంద్రానికి చెందిన అంబటి భూమయ్య మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మృతుడి అంత్యక్రియల కోసం రూ. 10వేలను స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు.

కానిస్టేబుల్‌కు అభినందనల వెల్లువ

రాయపోల్, మే 28: దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన కానిస్టేబుల్ చిందం సుభాష్ గౌరవ డాక్టరేట్ పొందడంతో మంగళవారం కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్‌ను సీపీ అనురాధ అభినందించారు.

వీర్ సావర్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

సిద్దిపేట టౌన్, మే 28: యువత వీర్ సావర్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని హిందూ వాహిని రాష్ట్ర సంపర్క సహప్రముఖ్ కస్తూరి భూమిరెడ్డి,రాష్ట్ర బోధన సహప్రముఖ్ చల్ల బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వీర్ సావర్కర్ 141 జయంతిని సిద్దిపేటలో మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో బసవరాజ్ సత్యం, కిరణ్‌కుమార్, రాజేశ్, శ్రీకాంత్, రాజు, పరశురాములు, అజయ్, కనకరాజు, నవీన్, పవన్, రాజేశ్, నరేశ్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గజ్వేల్, మే 28: అనుమతి లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాడోత్ రాజేందర్, బుక్యా శ్రీకాంత్ గజ్వేల్ చుట్టు పక్కల గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు మండలంలోని గిరిపల్లి గ్రామ శివారులో ఆటోలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

టైలరింగ్ యూనిట్ సందర్శన

హుస్నాబాద్‌రూరల్, మే 28: మండలంలోని పోతారం(ఎస్)లోని శ్రీశక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్‌ను మంగళవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ సందర్శించారు. టైలరింగ్ యూనిట్ పనివిధానం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సెర్ప్ ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, సీసీలు అశోక్, రవీందర్, వీవోఏ కనుకతార, అధ్యక్షురాలు యమున, శారద, యాదగిరి, సభ్యులు ఉన్నారు.

కాశీలో కోటి పార్థివ లింగార్చన నిమజ్జనం

సిద్దిపేట, మే 28 మట్టితో ఒక పార్థివ లింగాన్ని తయారుచేసి కాశీలో నిమజ్జనం చేస్తే 100 బంగారు లింగాలు తయారు చేసినంత పుణ్యం వస్తుందని శ్రీసాంబ సదాశివ మహదేవ సేవా సమితి అధ్యక్షుడు గోలి అశోక్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మొరం శెట్టి రాములు అన్నారు. శ్రీ సాంబ సదాశివ మహదేవ సేవ సమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సద్గురు సామవేదం షణ్ముఖశర్మ చేతుల మీదుగా కాశీలో కోటి పార్థివ శివలింగార్చన, నిమజ్జనోత్సవం నిర్వహించామన్నారు. సిద్దిపేటలో మొరంశెట్టి రాములు ఆధ్వర్యంలో మట్టి లింగాల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు పంచముఖ హనుమాన్ దేవాలయంలో నిర్వహించ తలపెట్టిన శివలింగాల తయారీ కేంద్రాన్ని గోలి అశోక్ ప్రారంభించినట్లు వివరించారు.అచ్చుల ద్వారా లింగాలను తయారు చేయడం వారికి నేర్పించినట్లు తెలిపారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

కొండపాక(కుకునూరుపల్లి), మే 28 : కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న ఉమ్మడి కొండపాక ఎంపీపీ ఎన్నిక బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఉమ్మడి కొండపాక మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఒకరు మృతి చెందగా, ప్రస్తుతం 13 మంది ఉన్నారని, చేతులెత్తే పద్ధతిలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నారు. గతంలో ఎంపీపీగా ఉన్న ర్యాగల్ల సుగుణ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమెను తొలిగించారు. అప్పటి నుంచి ఎంపీపీ స్థానం ఖాళీగా ఉంది.